క్లుప్తంగా

సందడిగా క్రిస్మస్



వేడుకల్లో పాల్గొన్న శ్రీధర్

విశాఖ విద్య: క్రిస్మస్ సందడి మొదలైంది. జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్య నగర్ యునైటెడ్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. క్రైస్తవులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి సభ్యులు శ్రీధర్‌ను సత్కరించారు.

కార్మికులకు సత్కారం



కార్మికులను సత్కరిస్తున్న యూనియన్ నాయకుడు దేవర

మల్కాపురం: విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా యూనియన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్‌లోని సీనియర్ కార్మికులను యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజు సత్కరించారు. 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద గల యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అప్పలరాజుయాదవ్ మాట్లాడుతూ కార్మికులకు అండగా పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.


ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ భుజంగరావు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల ప్రతిభ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ తోనంగి వెంకట రమణి యాదవ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ములగాడ తహసీల్దార్ భుజంగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధస్సును వెలికితీయవచ్చన్నారు. అలాగే, విద్యార్థులు సైన్స్ సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలని సూచించారు. సైన్స్‌పై అవగాహన ఉంటే ప్రపంచంపై, మానవ మనుగడపై అవగాహన వచ్చినట్లే అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో పలు తరగతుల విద్యార్థులు రూపొందించిన సోలార్ ప్లాంట్, భూగర్భ మార్గాల ద్వారా సులభతర ప్రయాణం, మానవ శరీరంలో అవయవాల పనితీరు తదితర నమూనాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని విమాన్ నగర్ వెస్ట్ లేన్ నెంబర్ 4లో రూ.12.85 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అలాగే బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి శ్రీ రామ బాల భక్త సేవా సంఘం విన్నపం మేరకు రెడ్డి వీధిలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకటలక్ష్మి, విమాన్ నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిపాటి సురేష్, వి. రమేష్, బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి రామ బాల భక్త సేవా సంఘం అధ్యక్షుడు పురెడ్డి చంటి రెడ్డి, కార్యదర్శి బోర రమేష్, ప్రతినిధులు పురెడ్డి పురెడ్డి ఎల్లయ్య రెడ్డి, పైడిరెడ్డి, పురెడ్డి చక్రవర్తి రెడ్డి, గొందేశి అప్పారావు రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతిబాట

మోడల్ వార్డుగా 40వ వార్డు అభివృద్ధి

రూ.12.11 కోట్లతో అభివృద్ధి పనులు



యారాడ మార్గంలో నిర్మించిన రోడ్డు



మరమ్మతులు, పెయింటింగ్ వేయడంతో అందంగా కనిపిస్తున్న రాజీవ్‌కాలనీ గృహాలు



ఏకేసీకాలనీలో నిర్మించిన హెల్త్ సెంటర్

సింధియా: మోడల్ వార్డుగా తన వార్డును తీర్చిదిద్దాలనే 40వ కార్పొరేటర్ సంకల్పం గత ప్రభుత్వ సుపరిపాలనతో నెరవేరింది. వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడిన ఆ వార్డు నేడు జీవీఎంసీ పరిధిలోని పలు వార్డులకు ఆదర్శంగా నిలుస్తోంది. వార్డులో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు సుమారు రూ.12.11 కోట్లతో చేపట్టారు. గత ప్రభుత్వం తమ ప్రాంతం అభివృద్ధికి పెద్దపీట వేసిందని అభివృద్ధి ఫలాలు అనుభవిస్తున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2019 ముందు అవస్థలు ఎన్నో...

2019 ముందు వరకూ జీవీఎంసీ 40వ వార్డులో గతుకుల రోడ్లు.. శిథిలమైన ఇళ్లు.. మట్టి రోడ్లతో అధ్వానంగా ఉండేది. ప్రభుత్వ గృహసముదాయాల్లో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. అలాంటి వార్డు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అత్యధిక నిధులు మంజూరు చేయడంతో ప్రగతిబాట పట్టింది. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో వార్డులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు చకచకా పూర్తి చేయించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, గృహసముదాయాల్లో మౌలిక వసతుల పనులు త్వరితగతిన పూర్తి చేశారు.



యారాడ ఘాట్ రోడ్డులో నిర్మిస్తున్న రక్షణ స్తంభాలు

అంతా గత వైభవమే...

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో అభివృద్ధి అంతా గత వైభవమే అని చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వివరాలు

- ఏకేసీకాలనీలో సుమారు రూ.96 లక్షలతో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు
- రాజీవ్‌కాలనీలో అండర్‌గ్రౌండ్ వాటర్ సప్లై కోసం రూ.10 లక్షల కేటాయింపు.
- రూ.40 లక్షలతో వాంబే గృహాల మధ్యలో యూజీడీ అండర్ గ్రౌండ్ పైపులైను, సిమెంట్ ప్లాట్‌ఫారం నిర్మాణం.
- రూ. 40 లక్షలతో వాంబే గృహాల మరమ్మతులు, పెయింటింగ్.
- రూ. 60 లక్షలతో 40వ వార్డు మెయిన్‌రోడ్డు నుంచి హనుమాన్ టెంపుల్ వరకు డ్రైనేజీ నిర్మాణం.
- రాజీవ్‌కాలనీ దారిలో బ్రిడ్జి కోసం వెచ్చిన నిధులు రూ.12 లక్షలు
- హనుమాన్ టెంపుల్ నుంచి బ్లాక్ ఆయిల్ కంపెనీ వరకు మెయిన్ డ్రైన్ కోసం వెచ్చిన నిధులు రూ. 40 లక్షలు
- యారాడ వెళ్లే మార్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్డు కోసం వెచ్చించిన నిధులు రూ.40 లక్షలు
- హాస్పటల్ చుట్టూ రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణం
- నూకాంబిక అమ్మవారి గుడి వద్ద రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం
- షిప్‌యార్డ్‌కాలనీలో శివాలయం వరకు వేసిన రోడ్ల కోసం వెచ్చించిన నిధులు రూ. 40 లక్షలు
- రూ.19 లక్షలతో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ గోడ పక్క నుంచి కల్వర్టుతో పాటు కొత్త రహదారి నిర్మాణం.
- జీ ప్లస్‌వన్ కమ్యూనిటీ హాల్ కోసం వెచ్చించిన నిధులు రూ.38 లక్షలు
- రూ.18 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం.



40వ వార్డులో నిర్మించిన ప్రధాన డ్రైనేజీ

- హడ్కో బిల్డింగుల మరమ్మతులకు వెచ్చించిన నిధులు రూ.19 లక్షలు
- కల్యాణ మండపం మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు రూ. 19 లక్షలు
- యారాడ ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులు రూ.3.50కోట్లు

ఆలా జీవీఎంసీ 40వ వార్డులో మొత్తం 8 కోట్ల 63 లక్షల అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించారు. దీంతో వార్డు కార్పొరేటర్‌నాగేశ్వరావు కృషికి వార్డు అభివృద్ధిపథంలో ముందుకు సాగడంతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టుపై కొత్త గ్రిల్ ఏర్పాటు



కల్వర్టుపై కొత్త గ్రిల్ వేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టును అధికారులు బాగు చేశారు. కల్వర్టు వద్ద గ్రిల్ వంగిపోయి ప్రమాదకరంగా మారడంతో పొంచి ఉన్న ప్రమాదంపై ఈ నెల 14న 'మేల్కొకుంటే ముప్పు' శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టారు. కల్వర్టుపై శిథిలమైన గ్రిల్ తొలగించి, కొత్తది వేశారు. కల్వర్టు బాగుపడి, ప్రమాదం తప్పడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, భక్తులు

సింధియా: మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని షిప్‌యార్డ్ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పరమశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈశ్వరుడికి క్షీరాభిషేకం చేసి, బిల్వ పత్రాలతో అర్చించారు. ఆలయ అర్చకులు శ్రీను పంతులు ఆధ్వర్యంలో దీపారాధన, రుద్రాభిషేకం చేశారు. జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'స్వీయ అంచనా' పేపర్లను పాఠశాలలకు పంపాలి

విశాఖ విద్య: ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో ఉన్నత పాఠశాలల్లో జరగబోయే సెల్ఫ్ అసెస్‌మెంట్(సాంప్) పరీక్షల పేపర్లను నేరుగా స్కూళ్లకు సరఫరా చేయాలని ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి ఒక ప్రకటనలో సూచించారు. పరీక్ష రోజున ఉదయం, సాయంత్రం ప్రధానోపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌కు గంట ముందు వెళ్లి పేపర్లు తీసుకుని పరీక్ష నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. పరీక్ష పేపర్లు లీకైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామనడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో పాఠశాలలు ఉన్నాయని, అంత దూరం నుంచి పేపర్లు పట్టుకెళ్లడం కూడా భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. విద్యాశాఖాధికారులే నేరుగా పాఠశాలలకు పరీక్ష పేపర్లు పంపించే కార్యక్రమం చేపట్టాలని విజయగౌరి సూచించారు.

ఏయూను సందర్శించిన అమెరికన్ ఎంబసీ అధికారులు



అమెరికన్ ఎంబసీ ప్రతినిధులతో సమావేశమైన రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం అమెరికన్ కాన్సులేట్ అధికారులు సందర్శించారు. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయం అమెరికన్ కార్నర్స్ ప్రొగ్రామింగ్ కోఆర్డినేటర్ మెలిసా నందుల, అమెరికన్ కాన్సులేట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కాలే నందుల ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఏయూలో అమెరికన్ కార్నర్ సాధిస్తున్న ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను వారికి వివరించారు. అమెరికన్ కార్నర్‌లో నిర్వహించే విభిన్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరు ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. అక్కడి వసతులు, నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను తెలుసుకుని ప్రశంసించారు.

ఏయూతో కలిసి పనిచేయండి



అమెరికన్ ప్రొఫెసర్ చార్లెస్‌ను సత్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్

విశాఖ విద్య: యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా(డేవిస్) స్టెమ్ సెల్ బయాలజిస్ట్ ప్రొఫెసర్ చార్లెస్ సోమవారం ఏయూను సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో అతిపెద్ద యూనివర్సిటీగా నిలుస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూతో కలిసి పనిచేయాలని, తమ విద్యార్థులకు బోధించాలని ప్రొఫెసర్ చార్లెస్‌ను రిజిస్ట్రార్ ఆహ్వానించగా.. ఆయన సాధారంగా స్వీకరించారు. ప్రొఫెసర్ చార్లెస్ తదితరులను ఏయూ తరఫున రిజిస్ట్రార్ సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. ఏయూలో ఫుడ్ సైన్స్, ఫార్మసీ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు, నూతన ప్రయోగశాల గురించి చార్లెస్‌కు వివరించారు. పరిశోధన, బోధన రంగాల్లో కలిసి పనిచేయాలని కోరారు. ప్రొఫెసర్ చార్లెస్ తదితరులను ఏయూ తరఫున రిజిస్ట్రార్ సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. అమెరికాకు చెందిన పారిశ్రామిక వేత్త డాక్టర్ మైక్, ఏయూ పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త శ్రీ వెంకట్, ఆచార్య బి.భరతలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు సహకరించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ ఆఫీస్ నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి కల్పించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులు

మహారాణిపేట: ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమను రీఓపెన్ చేసి ఉపాధి కల్పించాలని కాంట్రాక్ట్ వర్కర్లు డిమాండ్ చేశారు. ఎల్.జి.పాలిమర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్, ల్యాండ్ లోజర్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఉపాధి లభిస్తుందని తమ తాతలు, ఇతర పెద్దలు పరిశ్రమకు భూములిచ్చారని, పరిశ్రమను మూసివేయడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎల్జీ పాలిమర్స్ పరిశ్రమను తెరిపించి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

రక్షణగిరిపై నవదిన ప్రార్థనలు



కొవ్వొత్తులతో దీపారాధన చేస్తున్న మహిళలు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురి చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్స్ (పీపీసీ) సంయుక్త అధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం నవదిన ప్రార్థనలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో జ్ఞానాపురం వీధుల్లో ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు అతిథులుగా ఆర్చిబిషప్ మరియదాస్, బిషప్ పాల్ మైపాన్, ఫాదర్ వేళంగిణిరాజు పాల్గొని దీపారాధన ప్రారంభించారు. అనంతరం బాబుకాలనీ, జీఎస్ఎస్ఆర్‌యూఎం కాలనీల్లో మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు రాకకోసం ప్రజలు భక్తిశ్రద్ధలతో మెలగాలన్నారు. నవ దినాలు జరిగే దీపారాధనలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉక్కు కార్మికుల వేతనాలు చెల్లించాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: విశాఖ ఉక్కు యాజమాన్యం మొండి వైఖరి విడనాడి కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని, వేతన బకాయిలు వెంటనే జమ చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో సోమవారం చేపట్టిన 1404వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్మికులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. ఉక్కు యాజమాన్యంలో నేడు జవాబుదారీతనం లేకుండా పోయిందని ఆరోపించారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 18న ఉక్కు అడ్మిన్ భవనం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు డీసీహెచ్ వెంకటేశ్వరరావు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, పాపారావు, ఎర్రయ్య, కె.అప్పారావు, ఎం.వి.రమణ, మధు, రాజేశ్వరరావు, సోమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్



చింతల్లోవలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ వాసుల విద్యుత్ కష్టాలు ఎట్టకేలకు తీరాయి. కొన్ని నెలలుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. దీంతో గ్రామస్తులు సమస్యను కార్పొరేటర్ గల్లా చిన్నా దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టారు. లోడ్‌కు తగ్గట్టుగా సామర్థ్యం పెంచారు. ఈ పనులను కార్పొరేటర్ చిన్నా పర్యవేక్షించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గల్లా చిన్నా గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మరమ్మత్తు పనులను వేగవంతం చేశారు. గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా కార్యాలయంలో తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సింగరావు, గూడేల కృష్ణ, రాజారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లి దర్శనం.. తరించిన భక్తజనం



విశేష అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 15వ రోజు సోమవారం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతా, క్షీరాభిషేకాలు, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవ

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081 పేరిట చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, వాట్సాప్ నంబర్ 89855 15989కు, లేదా మెయిల్ ఐడీ dcoerkm ad@gmai .com ద్వారా పంపవచ్చు.

1500 మందికి అన్నదానం

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.